సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

సోమవారం । 17 । మార్చి । 2025



మూల్యాంకనానికి సర్వం సిద్ధం

ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాల మూల్యాంకనం(స్పాట్ వ్యాల్యుయేషన్) సోమవారం నుంచి ప్రారంభం కానుంది. -8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ సోమ॥ (సాా)	సహర్ మంగళ॥ (ఉ॥)
కడప	6.31	5.07
పులివెందుల	6.33	5.12
ప్రొద్దుటూరు	6.32	5.11

వాతావరణం

గరిష్టం/కనిష్టం 39.2/20.8

జిల్లాలో ఆదివారం 20.8 - 39.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.3 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేటి నుంచి ఓపెన్ స్కూల్ పది పరీక్షలు

కడప ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి ఓపెన్ స్కూల్ పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. 2353 మంది అభ్యాసకులు హాజరుకానున్నారు. జిల్లాలో 39 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 159 మంది ఇన్విజిలేటర్స్‌తోపాటు 39 మంది ఛీఫ్ సూపరింటెండెంట్లు, 39 మంది డిపార్టుమెంట్ ఆఫీసర్లను నియమించినట్లు కో–ఆర్డినేటర్‌సాంబశివారెడ్డి తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో డీడీయూజీకేవై పథకం కింద సి–డ్యాప్ సహకారంతో నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సంస్థ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ ప్రతినిధి ఇంతియాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ నిరుద్యోగ యువతకు నాలుగు నెలల కాల వ్యవధిలో ఉచితంగా కంప్యూటర్ హార్డ్‌వేర్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నిషియన్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, బ్యూటీ థెరపీ కోర్సులలో శిక్షణ ఉంటుందన్నారు. అభ్యర్థులు టెన్త్, ఐటీఐ పాస్, ఇంటర్, డిగ్రీ చదివి ఉండాలన్నారు. వయస్సు 18–32 ఏళ్లలోపు కలిగి ఉండాలని సూచించారు.

ఏపీ పీఎంహెచ్‌ఈయూ నూతన కార్యవర్గం ఎన్నిక



శ్రీనివాసులురెడ్డి



మహబూబ్‌బాషా

కడప రూరల్: ఆంధ్రప్రదేశ్ ప్రజా వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం (ఏపీ పీఎంహెచ్‌ఈయూ) జిల్లా నూతన అధ్యక్షుడిగా వై శ్రీనివాసులురెడ్డి, కార్యదర్శిగా ఎస్ఎండీ మహబూబ్‌బాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. తమ నియామకానికి సహకరించిన ఆస్కార్‌రావు, అహరోన్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కడప సెవెన్‌రోడ్స్: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్ సభాభవన్‌లో నిర్వహిస్తున్నట్లు డీఆర్వో విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా అందజేయవచ్చని తెలిపారు.

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుంచి 10.00 గంటల వరకు జరుగుతుందన్నారు. ప్రజలు 08562 -244437 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునన్నారు.

ఎన్టీఆర్ వైద్య సేవకు.. చంద్ర గ్రహణం!

ఎన్టీఆర్ వైద్య సేవలకు 'చంద్ర'గ్రహణం పట్టింది. పేదలకు ఉచిత వైద్యం అందించే 'డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ'పరిస్థితి తెగిన గాలి పటంలా మారింది. అందులో పనిచేస్తున్న సిబ్బందిలో ఆందోళన మొదలైంది. ప్రభుత్వం చర్చలకు పిలిచినా ఫలితం లేకుండా పోయింది. దీంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో ఉద్యోగులు నిర్ణయించిన ప్రకారం విధులను బహిష్కరించి నిరసనలు తెలపాలని నిర్ణయించారు. ఈ పథకంలో కీలకమైన విధులను చేపట్టే 'వైద్య మిత్ర'లు విధులను బహిష్కరిస్తే రోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారనుంది.

- సిబ్బంది ఆందోళన బాట
- నేడు వైద్య సేవలు బంద్
- 24న, 27న కూడా నిరసన.. విధుల బహిష్కరణ



నెట్ వర్క్ ఆసుపత్రిలో వైద్య మిత్రల డెస్క్

కడప రూరల్: 'డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ'లో పనిచేస్తున్న సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపలేదు. దీంతో అందులో పని చేస్తున్న ఉద్యోగులు దశల వారీగా విధుల బహిష్కరణ, శాంతి యుత నిరసనలకు పిలుపునిచ్చారు. అంతా బాగానే ఉంది. వైద్య సిబ్బంది విధులను బహిష్కరిస్తే రోగుల పరిస్థితి ఏమిటనేది అర్థం కాని ప్రశ్నగా మారింది. ప్రభుత్వం ఈ అంశాన్ని పరిగణలోకి తీసుకుందా..తెలిసీ తెలియనట్లు వ్యవహరిస్తోందా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

చర్చలు కొలిక్కిరాకపోవడంతో.....

డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవలో పనిచేస్తున్న వైద్య మిత్రలు టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి తమ ఉద్యోగ భద్రత, వేతనాల పెంపుకోసం ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. నిరవధికంగా సమ్మెకు వెళ్లడానికి సన్నద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించింది. దీంతో 2024 నవంబరు 13న ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు సీఈఓ డాక్టర్ డి.లక్ష్మిషాతో చర్చలు జరిపారు. ఈ చర్చలు ఏమాత్రం కొలిక్కి రాలేదు. ఈ సందర్భంగా సీఈఓ లక్ష్మిషా కొద్దిరోజులు ఆగమని చెప్పడంతో ఎన్టీఆర్ వైద్య సేవ సిబ్బంది ఓపిక పట్టారు. నెలలు గడుస్తున్నా తమ సమస్యలుపరిష్కారం కాకపోవడంతో మళ్లీ ఆందోళన బాట పట్టడానికి శ్రీకారం చుట్టారు. నాలుగు రోజుల క్రితం కూడా ఆ ట్రస్ట్ సీఈఓతో జరిపిన చర్చలు విఫలం చెందాయి.

జిల్లాలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ వివరాలు

- పనిచేసే సిబ్బంది: 114
- నెట్ వర్క్ ఆసుపత్రులు: 108
- ఆసుపత్రులకు ఒక రోజుకు వచ్చే రోగులు : 2 వేలకు పైగా
- ఆరోగ్య శ్రీ కార్డులు: 5.10 లక్షలు

ఆస్పత్రికి వచ్చే పేద రోగుల పరిస్థితేంటి?

'డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ'విభాగంలో భాగంగా ఉచిత వైద్య సేవలు అందే ఆసుపత్రుల్లో 'వైద్య మిత్ర'లు కీలంగా ఉంటారు. రిజిస్ట్రేషన్ మొదలు.. డిశ్చార్జ్ అయ్యే వరకు సదరు రోగి పర్యవేక్షణ బాధ్యతలను 'వైద్య మిత్ర'లే చూసుకుంటారు. వీరిపైన టీం లీడర్‌లు ఉంటారు. వీరు కూడా పర్యవేక్షణ బాధ్యతలు చూస్తారు. ఒక రోజు జిల్లా వ్యాప్తంగా వందలాది మంది ఉచిత వైద్యానికి వస్తుంటారు. కీలకమైన 'వైద్య మిత్ర'లు విధులను బహిష్కరిస్తే రోగులను ఎవరు చూసుకుంటారనేది ప్రశ్నార్థకంగా మారింది.

అభద్రతతో ఆందోళన

టీడీపీ కూటమి ప్రభుత్వం రావడంతోనే డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవగా పేరు మార్చడం అందరికీ తెలిసిందే. కాగా పేరు మార్పుతోపాటు పథకంలో కూడా అనూహ్యమైన మార్పులను తీసుకురావడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. అందులో భాగంగా కొన్ని రాష్ట్రాల్లో అమలులో ఉన్న ఆయుష్మాన్ భారత్ పథకాన్ని రాష్ట్రంలో కూడా తీసుకొచ్చి ఆ పథకానికి బీమాను అనుసంధానం చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టడం మొదలు పెట్టింది. దీంతో ఏళ్ల తరబడి ఆరోగ్య శ్రీని నమ్ముకుని పనిచేస్తున్న ఆరోగ్యమిత్రల్లో (నేడు వైద్య మిత్రలు) ఆందోళన మొదలైంది. ఆరోగ్యశ్రీ ఇన్స్యూరెన్స్ పరిధిలోకి వెళితే ఆ సంస్థకు చెందిన వారు తమను తీసివేసి మరొకరిని నియమిస్తారనే వాదన బలంగా వినబడుతోంది. కాగా, వాస్తవానికి జరిగేది కూడా అదే కావడంతో పనిచేస్తున్న ఉద్యోగుల్లో అభద్రత నెలకొంది. దీనికితోడు ఈ వైద్య సేవలు బీమా పరిధిలోకి వెళితే వ్యాధుల సంఖ్యతోపాటే ప్యాకేజీ గణనీయంగా తగ్గనుంది. దీంతో ఆరోగ్యశ్రీలో ఉండే ప్రయోజనాలు, బీమా వల్ల వచ్చే ఉపయోగాలు ఏమాత్రం ఉండవన్నది స్పష్టంగా అర్థమవుతోంది.

తప్పని పరిస్థితుల్లోనే నిరసన



ఉద్యోగ భద్రత..వేతనాల పెంపు ఇతర సమస్యల పరిష్కారానికి చాలా నెలల నుంచి ఆందోళన చేపడుతున్నాం. మా సమస్యలను ప్రభుత్వానికి విన్నవించాం. సమస్యలు పరిష్కారం కాలేదు. తప్పని పరిస్థితుల్లో ఈ నెల 17న కలెక్టరేట్ వద్ద శాంతియుత నిరసన తెలుపుతున్నాం. అలాగే 24న జిల్లా కో ఆర్డినేటర్ కార్యాలయం వద్ద, 27న మంగళగిరిలోఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ కార్యాలయం వద్ద విధులను బహిష్కరించి శాంతియుత నిరసన తెలపాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. - విజయ్, అధ్యక్షులు, జిల్లా ఎన్టీఆర్ వైద్య సేవ వైద్య మిత్రల యూనియన్

రూటే..సప'రేటు'పై కలెక్టర్ స్పందన

- డీఎంహెచ్ఓ ఏఓను డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు సరెండర్ చేస్తూ ఆదేశం

కడప రూరల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జరిగిన అవినీతి ఆరోపణలపై ఈ నెల 7న సాక్షిలో ప్రచురితమైన రూటే..సప'రేటు'అనే కథనంపై కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి స్పందించారు. అధికారులను పిలిపించుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పూర్తి విచారణ అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఏఓ శ్రీదేవిని డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు సరెండర్ చేశారు. అలాగే ఇందుకు సంబంధించి లోతుగా విచారించాలని ఒక అధికారిని నియమించారు. కాగా ఈ వ్యవహారానికి సంబంధించి డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ పద్మావతి సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది.

సాక్షి ఎఫెక్ట్..

కోట్ల స్వాహాపై విచారణ

కడప రూరల్: జిల్లా క్షయ నియంత్రణ విభాగంలో జరిగిన అవినీతిపై ఈ నెల 16న సాక్షిలో ప్రచురితమై 'క్షయ నియంత్రణ పేరుతో కోట్లు మింగేశారు'కథనం ఆ శాఖలో ప్రకంపనలు పుట్టించింది. ఈ అంశంపై ఉన్నతాధికారులు సైతం స్పందించారు. విచారణకు ఆదేశించారు.ఈ నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు ఈ నెల 18న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జరిగే మీటింగ్‌కు క్షయ నియంత్రణ విభాగంలో పనిచేస్తున్న సిబ్బంది సంబంధిత రికార్డులతో రావాలని ఆదేశించారు. అలాగే 2023–2025 నుంచి జరిపిన బ్యాంకు లావాదేవీలపై కూడా ఆరా తీయనున్నారు.

ఘనంగా ఉరుసు

సిద్దవటం: పరకోటలో వెలసిన హజరత్ సయ్యద్ షా బిస్మిల్లాషా ఖాద్రీ దర్గాలో ఆదివారం ఉరుసు మహోత్సవం ఘనంగా జరిగింది. శనివారం రాత్రి గంధోత్సవం సందర్భంగా ఫాతెహాను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గంధం అర్పించేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు.

ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలకు కట్టుదిట్టమైన భద్రత

ఒంటిమిట్ట: ఒంటిమిట్టలో ఏప్రిల్ 5 నుంచి 15 వరకు జరగనున్న శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు వైఎస్ఆర్ జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ తెలిపారు. ఒంటిమిట్ట కోదండ రామాలయం వద్ద చేపడుతున్న భద్రతా ఏర్పాట్లను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీలు, సీఐలకు పలు సూచనలు చేశారు. పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలన్నారు. కడప–ఒంటిమిట్ట మార్గంలోని ఉప్పరపల్లె వద్ద ఏర్పాటు చేయనున్న పార్కింగ్ ప్రదేశం, కల్యాణ వేదిక, సాలాబాద్ వద్ద ఉన్న పార్కింగ్ ప్రవేశం, టీటీడీ గెస్ట్ హౌస్, వీవీఐపీ గెస్ట్ హౌస్, ఆలయ పరిసరాలు పరిశీలించారు. అక్కడ చేపట్టాల్సిన బందోబస్తు ఏర్పాట్లపై కడప డీఎస్పీ వెంకటేశ్వర్లుతో మాట్లాడారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. కల్యాణ వేదిక సమీపంలోని పార్కింగ్ స్థలం వద్ద వాహనాలు క్రమ పద్ధతిలో నిలిపి ఉంచేలా పర్యవేక్షించాలన్నారు. భారీ కేడ్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట సీఐ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.



డీఎస్పీ, సీఐలకు సూచనలు చేస్తున్న ఎస్పీ అశోక్ కుమార్

రామయ్యను దర్శించుకున్న జేసీలు

ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయాన్ని కడప జిల్లా జాయింట్ కలెక్టర్ అతిధి సింగ్, అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్‌లు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ లాంఛనాలతో వారికి స్వాగతం పలికి ప్రదక్షణ గావించి గర్భాలయంలోని మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ రంగమండపంలో సేదతీరిన వారికి అర్చకులు సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఒంటిమిట్ట మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

అమరజీవి త్యాగం ఆదర్శనీయం

డీఆర్వో విశ్వేశ్వరనాయుడు

కడప సెవెన్‌రోడ్స్: ప్రత్యేక తెలుగు రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు పేర్కొన్నారు. ఆదివారం కలెక్టరేట్లో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సంస్మరణ సభ జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ జాతికోసం ప్రాణాలర్పించిన మహనీయులు అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. విధినిర్వహణలో ప్రతి ఉద్యోగికి ఆయన అత్యున్నత విలువలు స్పూర్తిదాయకం అన్నారు. ముందుగా అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి డీఆర్వోతో పాటు పలువురు పూలమాలవేసి నివాళులర్పించారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మి, కలెక్టరేట్ అన్ని సెక్షన్ల సూపరింటెండెంట్లు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఆర్వో, ఇతర అధికారులు

ప్రాణత్యాగం చేసిన మహనీయుడు

కడప అర్బన్: దేశంలోని భాషా ప్రయుక్త రాష్ట్రాలకు స్ఫూర్తిగా నిలిచిన అమరజీవి పొట్టి శ్రీరాములు మనందరికి గర్వకారణమని ఎస్పీ ఈ.జి అశోక్ కుమార్ కొనియాడారు. అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు జయంతిని జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్పీఅశోక్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై, అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. అదనపు ఎస్పీ కె ప్రకాష్ బాబు, ఏఆర్ అదనపు ఎస్పీ బి. రమణయ్య, ఆర్ఐలు ఆనంద్, వీరేష్, టైటాస్, శివరాముడు, ఆర్.ఎస్.ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

విజయీభవ!

ఏడాదంతా నేర్చుకున్న జ్ఞానాన్నంతా..
పేపరుపై జాలువార్చే సమయం ఆసన్నమైంది..
మదిలో నిక్షిప్తమై ఉన్న అక్షర గనిని
వెలికితీసే ఘడియ రానే వచ్చింది..
కంగారు పడకుండా ఆత్మవిశ్వాసంతో
అడుగేయాల్సిన శుభ తరుణమిదే..
బంగరు భవితకు బాటలు వేసుకునే
బంగారు క్షణమిదే..
ఈ రోజు నీ కలం నుంచి జాలువారే
'అక్షరాల కలబోత'
నీ జీవితాశయం వైపు తీసుకెళ్లే
నుదుటి రాత...
మేలుకో.. గమ్యం వైపు
సాగిపో.. ఓ విద్యార్థీ..
విజయీభవ!!



- నేటి నుంచి జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు ప్రారంభం
- సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- హెల్ప్‌లైన్ నెంబర్స్ 9505810113, 7093526499



కడపలోని పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను సిబ్బందితో కలిసి పరిశీలిస్తున్న డీఈఓ షేక్ షంషుద్దీన్



జిల్లాలో అన్ని యాజమాన్య

- పాఠశాలల సంఖ్య: 593
- పరీక్షా కేంద్రాల సంఖ్య: 161
- పరీక్షలు రాసే మొత్తం విద్యార్థుల సంఖ్య: 27800
- బాలురు: 14330
- బాలికలు: 13470
- చీఫ్ సూపరింటెండెంట్లు : 161
- డిపార్టుమెంట్ ఆఫీసర్లు: 161
- పరీక్షల విధుల్లో పాల్గొనే ఇన్విజిలేటర్లు: 1671
- సిట్టింగ్ స్క్వాడ్ సభ్యులు: 43
- ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు: 08

కడప ఎడ్యుకేషన్: విద్యార్థి జీవితంలో కీలకమైన ఘట్టానికి సమయం ఆసన్నమైంది. పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యే శుభ ఘడియ రానే వచ్చింది. జిల్లావ్యాప్తంగా నేటి నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు విద్యాశాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు. పరీక్షా కేంద్రాలలో తాగునీరు, విద్యుత్తు, ఫర్నీచర్‌తోపాటు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యార్థులను పరీక్షా కేంద్రాలలోకి 8.45 గంటలకే అనుమతిస్తామని విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. దూర ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సుల్లో పరీక్షకు వచ్చేవారు తమ హాల్‌టికెట్‌ను చూపించి ఉచితంగా రావచ్చని వివరించారు. పరీక్షా కేంద్రాలలో సమస్యలేవైనా ఉంటే తెలిపేందుకు వీలుగా ఈనెల 17 నుంచి మే 1 తేదీ వరకు కడప డీఈఓ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఇందుకోసం 7093526499, 9505810113 ఫోన్ నెంబర్‌లను ఏర్పాటు చేశారు. సంబంధిత పరీక్షలు ఉదయం 9.30 నుంచి 12.45 వరకు ఉంటాయి. ఈ ఏడాది కూడా అన్ని పరీక్షా కేంద్రాలను 'నో ఫోన్ జోన్'గా ప్రభుత్వం ప్రకటించింది. దీంతో చీఫ్ సూపరింటెండెంట్‌తో, డిపార్టుమెంట్ ఆఫీసర్, సిబ్బంది ఎవరి వద్ద కూడా సెల్‌ఫోన్‌ను ఉండకూడదని ఉన్నతాధికారులు ఆదేశించారు. పరీక్ష విధులకు హాజరయ్యే సిబ్బంది ఖచ్చితంగా గుర్తింపు కార్డును ధరించాలని ఆదేశించారు.

జిల్లాలో 6 సమస్యాత్మక కేంద్రాలు గుర్తింపు...

జిల్లాలో ఆరు పరీక్షా కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించారు. ఇందులో కమలాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, బి.మఠం మండలం కంది మల్లాయపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల, బి కోడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కొండాపురం జడ్పీ ఉన్నత పాఠశాల, వేంపల్లి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, సింహాద్రిపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలను గుర్తించారు. ఈ సమస్యాత్మక కేంద్రాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు.

పరీక్షల పరిశీలకుడిగా మధుసూదనరావు




స్క్వాడ్ సభ్యులతో మాట్లాడుతున్న జిల్లా పరిశీలకులు మధుసూదన్‌రావు

కడప ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్షల పర్యవేక్షణకు ప్రభుత్వ పాఠ్య పుస్తకాల రాష్ట్ర డైరెక్టర్ మధుసూదన్‌రావును జిల్లా పది పరీక్షల పరిశీలకులుగా ప్రభుత్వం నియమించింది. ఆదివారం కడపకు చేరుకున్న ఆయన డీఈఓతో కలిసి పరీక్షల నిర్వహణపై చర్చించారు. పలు సూచనలు చేశారు.

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి


జిల్లావ్యాప్తంగా నేటి నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని పరీక్షల జిల్లా పరిశీలకులు, ప్రభుత్వ టెక్స్‌బుక్స్ రాష్ట్ర డైరెక్టర్ మధుసూధన్‌రావు పేర్కొన్నారు. కడపలోని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఆదివారం ఆయన డీఈఓ షేక్ షంషుద్దీన్‌తో కలిసి స్క్వాడ్‌తో పరీక్షల పర్యవేక్షణపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల్లో ఎక్కడ కూడా ఎలాంటి ఆరోపణలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టిని సారించాలన్నారు. డీఈఓ షేక్ షంషుద్దీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏడీ మునీర్‌ఖాన్, స్క్వాడ్ సభ్యులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు ఉచిత ప్రయాణం



కడప కోటిరెడ్డిసర్కిల్: పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు ఆర్టీసీ సంస్థ ఆయా రోజుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. పరీక్ష జరిగే రోజు విద్యార్థులు హాల్ టికెట్ చూపి పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు బస్సుల్లో ప్రయాణించవచ్చు. విద్యార్థులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు తెలియజేశారు.


ప్రశాంతంగా వెళ్లాలి



పదో తరగతి పరీక్షలను రాసేందుకు వెళ్లే విద్యార్థులు నిర్ణీత సమయానికంటే ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. గతంలో రాసిన మోడల్ పరీక్షకు కొనసాగింపే అనుకుంటే ఈ పబ్లిక్ పరీక్షలు కూడా మరింత ఆత్మవిశ్వాసంతో రాయగలరు. మనసులో ఎలాంటి 'టెన్'షన్ లేకుండా పరీక్ష ప్రశాంతంగా ప్రారంభించాలి. ముఖ్యంగా పరీక్షకు వచ్చే ముందు ఖచ్చితంగా ఏదో ఒకటి తిని రావాలి.

- ఓ. వెంకటేశ్వరరెడ్డి, ప్రముఖ సైకాలజిస్టు


పరీక్షలకు సర్వం సిద్ధం



పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నాం. జిల్లాలో ఏ పరీక్షా కేంద్రంలో కూడా విద్యార్థులు కింద కూర్చొని పరీక్షలు రాసే పరిస్థితి లేదు. అన్ని పరీక్షా కేంద్రాలలో కూడా డెస్కులను ఏర్పాటు చేశాం. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసే విధంగా అన్ని రకాల చర్యలు తీసుకున్నాం.

- షేక్ షంషుద్దీన్, డీఈఓ, వైఎస్సార్‌జిల్లా

మాస్‌కాపీయింగ్ కట్టడికి చర్యలు



విద్యార్థులు పరీక్షలను ప్రశాంతంగా రాసే విధంగా అన్ని ఏర్పాట్లును పూర్తి చేయించాం. విద్యార్థులంతా 8.45 గంటల నుంచే పరీక్షా కేంద్రాలలోని అనుమతించాలని చెప్పాం. పొరపాటున ఏ పరీక్షా కేంద్రంలోనైనా ఆరోపణలు వచ్చినా చర్యలు ఉంటాయి. పరీక్ష విధులకు కేటాయించిన సిబ్బంది అన్ని జాగ్రత్తలు తీసుకుని పరీక్షలను నిర్వహించాలి. ఎక్కడ కూడా మాస్‌కాపీయింగ్ అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలి.

- కాగిత శ్యాముల్, ఆర్‌జేడీ, పాఠశాల విద్య

క్లుప్తంగా

గోవా మద్యం బాటిళ్లు పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు, కారుతో ఎన్‌ఫోర్స్‌మెంట్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక జమ్మలమడుగు రోడ్డులో వైఎస్సార్ సర్కిల్ వద్ద 18 గోవా మద్యం బాటిళ్లను ఎన్‌ఫోర్స్‌మెంట్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి నీలకంఠేశ్వరరెడ్డి, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సురేంద్రా రెడ్డి, సిబ్బందితో ఆదివారం వాహనాలను తనిఖీ చేపట్టారు. ఒక స్విఫ్ట్ డిజైర్ కారును తనిఖీ చేయగా అందులో 750 ఎంఎల్ గల 18 గోవా మద్యం బాటిళ్లు దొరికాయి. కాటం వీరేంద్ర, ఉప్పు రామకృష్ణ అనే ఇద్దరు వ్యక్తులు వీటిని తరలిస్తున్నారని, వారిపై కేసు నమోదు చేసి మద్యం బాటిళ్లను, కారును స్వాధీనం చేసుకున్నట్లు వారు తెలిపారు.

18న పీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా

కడప వైఎస్ఆర్ సర్కిల్ : పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా ఈపీఎస్ పెన్షనర్‌లకు కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలని కోరుతూ ఈనెల 18న మంగళవారం పీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రామకృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్ని అంటుతున్న నేపథ్యంలో ఈపీఎస్ పెన్షనర్స్‌కు వెయ్యి రూపాయలు పెన్షన్ ఇస్తే ఏ రకంగా బతుకుతారని ప్రశ్నించారు. ఆరు నెలలకు ఒకసారి డీఏ చెల్లించాలని, కనీస పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలని, పెన్షన్‌దారులకు ఈఎస్ఐ ద్వారా వైద్య సౌకర్యం కల్పించాలని కోరారు.

రిమ్స్‌లో గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం



కడప అర్బన్ : కడప రిమ్స్‌లో ఈనెల 9వ తేదీన ఓ గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. అతను ఈనెల 5న తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరాడు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీలో ఉంచారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే తగిన ఆధారాలతో తమను సంప్రదించాలని రిమ్స్ అధికారులు తెలిపారు.

నలుగురు క్రికెట్ బుకీలు అరెస్ట్



అరెస్ట్ వివరాలను మీడియాకు వెల్లడిస్తున్న సీఐ రామకృష్ణారెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక ఎర్రగుంట్ల రోడ్డులోని పాత పీఎంఎఫ్ వద్ద నలుగురు క్రికెట్ బుకీలను వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఇటీవల జరిగిన ఛాంపియన్ షిప్ ట్రోఫీ సందర్భంగా క్రికెట్ పందేలు నిర్వహించి పలువురు డబ్బులు పంచుకుంటున్నారని సమాచారం రావడంతో వన్‌టౌన్ సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ సంజీవరెడ్డి, శ్రీనివాసులు ఆదివారం సాయంత్రం సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. దాడిలో ఆర్.నాగేంద్ర, గాలిపోతుల ఆనంద్, ఆర్.మనోజ్, బొమ్మిశెట్టి శివప్రసాద్‌లను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.1.20 లక్షలు నగదు, 5 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మూల్యాంకనానికి సర్వం సిద్ధం

- నేటి నుంచి ఇంటర్మీడియట్ మూల్యాంకనం ప్రారంభం
- కడప ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వేదికగా ఏర్పాట్లు
- 2,05,000 పేపర్లకు మూల్యాంకనం
- నాలుగు విడతల్లో జరగనున్న స్పాట్ ప్రక్రియ



మూల్యాంకనానికి సిద్ధం చేసిన డెస్కులు

కడప ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాల మూల్యాంకనం(స్పాట్ వ్యాల్యుయేషన్) సోమవారం నుంచి ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఇంటర్ అధికారులు పూర్తి చేశారు. ఈ ప్రక్రియ ఈనెల 17వ తేదీ సోమవారం నుంచి కడపలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వేదికగా ప్రారంభం కానుంది. ప్రధాన ద్వారంతోపాటు మూల్యాంకనం జరుగుతున్న అన్ని గదుల్లోనూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. దిద్దుబాటులో జరిగే తప్పులు, దోషాలకు ఎగ్జామినర్లు, సిబ్బంది బాధ్యత తీసుకోవాల్సి ఉంటుందని ఇంటర్ అధికారులు తెలిపారు.

నాలుగు విడతల్లో మూల్యాంకనం..

ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి సంబంధించిన మూల్యాంకనం కోసం 2,05,000 జవాబు పత్రాలు జిల్లాకు రావాల్సి ఉండగా ఇప్పటి వరకు 1,85,253 పేపర్లు జిల్లాకు చేరుకున్నాయి. వీటిలో 1,75,393 కు కోడింగ్‌ను కూడా పూర్తి చేశారు. మిగతా వాటికి కోడింగ్ చేస్తున్నారు. జవాబు పత్రాల మూల్యాంకనం మొత్తం నాలుగు విడతల్లో జరగనుంది. ఇందుకు సంబంధించి ఉదయం, సాయంత్రం రెండు సెషన్లలో మూల్యాంకనం జరగనుంది. మొదటి సెషన్ ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు, 2వ సెషన్ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుంది. ఇందులో ఒక ఎగ్జామినర్ పూటకు 15 చొప్పున రోజుకు 30 పేపర్లను దిద్దాల్సి ఉంటుంది. ఈ మూల్యాంకనం కోసం 450 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 100 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 100 మంది స్క్రూటినైజర్లు, 25 మంది ఏసీఓలను నియమించినట్లు ఆర్ఐఓ తెలిపారు.

సిబ్బంది నియామకం పూర్తి..

మూల్యాంకన విధుల కోసం ఎగ్జామినటర్ల నియామక ఉత్తర్వులను ఇంటర్మీడియట్ బోర్డు ఇప్పటికే ఆయా కళాశాలలకు చేరవేసింది. పేపర్ వ్యాల్యుయేషన్ ప్రక్రియలో భాగంగా స్పాట్ క్యాంపు ఆఫీసర్‌గా ఆర్ఐఓ బండి వెంకటసుబ్బయ్య వ్యవహరిస్తారు. జనరల్–1 కడప ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యారావు, జనరల్–2 గా కడప ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఉర్దూ లెక్చరర్ హబీబుల్లా, సీసీఓ–1గా ప్రొద్దుటూరు ఉర్దూ కాలేజీ ప్రిన్సిపాల్ రమణారెడ్డి, సీసీఓ–2గా కమలాపురం ఎయిడెడ్ కళాశాల ప్రిన్సిపాల్ సర్వేశ్వరరెడ్డి నియమితులయ్యారు. వీరితోపాటు కోడింగ్ ఆఫీసర్లు, ఏసీఓలు, సబ్జెక్టు ఎక్స్‌పర్ట్, చీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్లు, స్క్రూటినైజర్ల నియామక ప్రక్రియ పూర్తయింది.

అధ్యాపకులను రిలీవ్ చేయకపోతే కళాశాలలకు జరిమానా

బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ నుంచి ఇంగ్లీష్, తెలుగు, హిందీ, సివిక్స్, గణితం సబ్జెక్టులో చీఫ్ ఎగ్జామినర్లు, ఎగ్జామినర్లుగా నియమితులైన అధ్యాపకులను సంబంధిత కళాశాల ప్రిన్సిపాళ్లు తప్పని సరిగా రిలీవ్ చేయాలని స్పాట్ వాల్యూయేషన్ క్యాంప్ ఆఫీసర్ బండి వెంకటసుబ్బయ్య తెలిపారు. కళాశాలల్లో రిలీవ్ అయిన అధ్యాపకులు 17వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు స్పాట్ వాల్యుయేషన్ క్యాంపునకు హాజరుకావాలన్నారు. వ్యాల్యూయేషన్ డ్యూటికి నియమితులైన అధ్యాపకులను రిలీవ్ చేయని కళాశాలలకు బోర్డు ద్వారా జరిమానా విధిస్తామన్నారు.

మూల్యాంకనం షెడ్యూల్ ఇలా...		
విడత	మొదలయ్యే తేదీ	దిద్దనున్న సబ్జెక్టు వివరాలు
1వ స్పెల్	మార్చి 17వ తేదీ నుంచి	ఇంగ్లీష్, మ్యాథ్స్, సివిక్స్, తెలుగు, హిందీ
2వ స్పెల్	మార్చి 22వ తేదీ నుంచి	ఫిజిక్స్, ఎకనామిక్స్
3వ స్పెల్	మార్చి 24వ తేదీ నుంచి	కెమిస్ట్రీ, హిస్టరీ
4వ స్పెల్	మార్చి 28వ తేదీ నుంచి	కామర్స్, బోటనీ, జువాలజీ

మూల్యాంకన విధులకు తప్పకుండా హాజరు కావాలి..



జిల్లాలో నేటి నుంచి ప్రారంభం కానున్న మూల్యాంకన విధులకు కేటాయించిన సిబ్బంది తప్పక హాజరుకావాలి. మూల్యాంకన కేంద్రంలోకి సెల్‌ఫోన్‌ను అనుమతించడం జరగదు. కేంద్రంలో సీసీ కెమెరాను ఏర్పాటు చేశాం. పేపర్ల దిద్దుబాటులో అలసత్వం ప్రదర్శించి తప్పులు చేస్తే మూల్యం చెల్లించుకోక తప్పదు.

– బండి వెంకటసుబ్బయ్య, ఆర్ఐఓ, ఇంటర్ స్పాట్ క్యాంపు ఆఫీసర్

మల్లూరమ్మ హుండీ ఆదాయం రూ.2,93,890



మల్లూరమ్మ ఆలయ హుండీలను లెక్కిస్తున్న సిబ్బంది

చిన్నమండెం : చిన్నమండెం మండలం మల్లూరు, కొత్తపల్లె గ్రామాల సరిహద్దు మాండవ్యనది ఒడ్డున ఉన్న మల్లూరమ్మ తల్లి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం కావడం ఇటీవలే అమ్మవారి జాతర వైభవంగా జరగడంతో పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు. అదే విధంగా మల్లూరమ్మ తల్లి ఆలయ హుండీలను లెక్కించగా రూ.2,93,890 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ కొండారెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

మదనపల్లె సిటీ/బి.కొత్తకోట : రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటనలు ఆదివారం జరిగాయి. బి.కొత్తకోట మండలం గొళ్లపల్లి పంచాయతీ కనికలతోపుకు చెందిన షేక్ మౌలాలి(35) పేపర్‌బాయ్‌గా పని చేస్తున్నాడు. ఉదయం పేపర్ ద్విచక్రవాహనంలో వేస్తుండగా ఎదురుగా వచ్చి కారు ఢీకొనడంతో గాయపడ్డాడు. స్థానికులు గమనించి మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. గుర్రంకొండ మండలం చెరువుముందరపల్లెకు చెందిన నారాయణ (45) ద్విచక్రవాహనంలో కలకడ క్రాస్ వద్ద వెళుతుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు.

మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి చర్యలు

మేజర్ జనరల్ అజయ్‌మిశ్రా



సమావేశానికి హాజరైన మేజర్ జనరల్ అజయ్‌మిశ్రా, ఇతర సైనికాధికారులు

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలోని మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మేజర్ జనరల్ అజయ్‌మిశ్రా అన్నారు. ఆదివారం జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన మాజీ సైనికుల మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశానికి భారీ సంఖ్యలో హాజరైన మాజీ సైనికులు, వారి కుటుంబాలకు చెందిన వ్యక్తులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను మేజర్ జనరల్ అజయ్‌మిశ్రా, బ్రిగేడియర్ వెంకటరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కొన్ని చిన్న సమస్యలను అక్కడే పరిష్కరించారు. కల్నల్ మాథ్యూ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మాజీ సైనికులకు పరీక్షలు నిర్వహించి ఉచిత వైద్య సేవలు అందించారు. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలకు చెందిన తొమ్మిది మంది దివంగత సైనికుల సతీమణులను ఘనంగా సత్కరించారు. వారికి చీర, మెమెంటో, సెమీ ఆటోమేటిక్ వాషింగ్ మిషన్లు బహూకరించారు. మాజీ రిక్రూట్ సహదేవరెడ్డికి ట్రై స్కూటర్ అందించారు. అలాగే తొమ్మిది మంది మాజీ సైనికులకు ట్రై ప్యాడ్, వాకింగ్ స్టిక్స్, ఐదుగురికి వీల్ చైర్లు అందజేశారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారి రజాక్‌ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కల్నల్ ఎస్‌కే సింగ్, జాయింట్ డైరెక్టర్ హాస్పిటల్ సర్వీసెస్ కల్నల్ ఆర్.దత్తా, కల్నల్ బి.బుధౌరి, ఆర్మీ వెల్ఫేర్ ప్లేస్‌మెంట్ అధికారి బ్రిగేడియర్ వెంకటరెడ్డి, కల్నల్ రాంప్రకాశ్, కల్నల్ కుల్‌దీప్‌మానె, కల్నల్ అశ్విన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు కార్యక్రమంలో పాల్గొని తమ శాఖ ద్వారా అందించిన వైద్య సేవలను పర్యవేక్షించారు.

బి.కొత్తకోటలో సీపీఐ శత వార్షిక వేడుకలు



బి.కొత్తకోటలో జరిగిన ప్రదర్శనలో నారాయణ

బి.కొత్తకోట : సీపీఐ శత వార్షిక వేడుకలను ఆదివారం బి.కొత్తకోటలో ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ జాతీయ కార్యదర్శి నారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక జ్యోతిచౌక్ నుంచి మెయిన్‌రోడ్డు, దిగువబస్టాండ్, పంచాయతీ వీధి, బైపాస్‌రోడ్డు, రంగసముద్రంరోడ్డు మీదుగా ప్రదర్శన నిర్వహించారు. నారాయణ డప్పుకొట్టి ప్రదర్శనను ప్రారంభించారు. అంతకుముందు జ్యోతిచౌక్ చేరుకున్న నారాయణ ఇక్కడి సాదిక్‌బాషా బిర్యానీ హోటల్ వద్దకు వచ్చి సాధారణ వ్యక్తిలా గ్లాసుతో నీళ్లు తాగారు. వెనక్కి ఇస్తూ ఏం వండారు అని నిర్వాహకున్ని ప్రశ్నించగా బిర్యాని అని చెప్పడంతో కొద్దిగా అన్నం పెట్టమని ప్లేటులో తీసుకుని రుచి చూశారు. అక్కడే ఉన్న ఓ విలేకరి చికెన్ తినరా అని ప్రశ్నించగా తింటాను ఓ ముక్క పెట్టమని చెప్పి పెట్టించుకుని తిన్నారు. ర్యాలీ సందర్భంగా స్థానికులు ఆయనతో మాట్లాడేందుకు ఆసక్తి చూపారు. నారాయణ ఉమ్మడి చిత్తూరు జిల్లా కమిటీలో సభ్యునిగా పనిచేస్తున్న కాలం నుంచి బి.కొత్తకోటతో అనుబంధం ఉంది. దీంతో పాతతరం సీపీఐ నాయకులను పేరుతో పలకరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నరసింహులు, రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు ఈశ్వరయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గంగాధర, ఉపప్రధాన కార్యదర్శి సలీంబాషా, ఉపాధ్యక్షులు వేణుగోపాల్‌రెడ్డి, కార్యదర్శి సాంబశివ, రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కృష్ణప్ప, ప్రజానాట్యమండలి కార్యదర్శి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలం, బుడుగుంటపల్లి పంచాయతీ, రైల్వేస్టేషన్ సమీపంలో అనంతపురం దొనగిరికి చెందిన లక్ష్మీనారాయణ (35) అనే యువకుడు విద్యుత్ హై టెన్షన్ స్తంభానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలిలా.. రెండేళ్ల క్రితం రైల్వేకోడూరుకు బేల్దారీ పనులు చేసుకునేందుకు భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి వచ్చి బాలానగర్‌లో నివాసం ఉండేవాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆ యువకుడు ఉరివేసుకున్నాడు. దీంతో కుటుంబమంతా వీధిన పడింది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోటారు వైర్లు చోరీ



వైర్లు కత్తిరించుకుని వెళ్లిన దృశ్యం

రాజంపేట రూరల్ : మండల పరిధిలోని ఆకేపాడు గ్రామ పంచాయతీలో శనివారం రాత్రి బోర్ వైర్ కేబుళ్లను దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధితులు వాపోయారు. రాయచోటికి వెళ్లే దారిలో ఉన్న వీరంరెడ్డి నారాయణరెడ్డి పొలంలోని 2 బోర్లకు చెందిన మోటర్ వైర్లు, స్టార్టర్లు దొంగిలించారు. అలాగే వీరంరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి, మందకాల శ్రీనివాసులు, బొమ్మ రంగారెడ్డికి చెందిన మోటార్ వైర్లు, స్టార్టర్లు కూడా ఎత్తుకెళ్లారు. గొళ్ల విజయరెడ్డికి చెందిన 3 మోటాటర్ వైర్ కేబుళ్లు, గొళ్ల సుజాతారెడ్డికి చెందిన 2 మోటార్ వైర్ కేబుళ్లు చోరీకి గురయ్యాయి. పోలీసులు దొంగలను పట్టుకోవాలని బాధితులు కోరుతున్నారు.

'నాకు రక్షణ కల్పించండి'

సిద్దవటం : తనను హతమార్చేందుకు యత్నిస్తున్నారని, రక్షణ కల్పించాలని సిద్దవటం మండలం కడపాయపల్లె గ్రామానికి చెందిన బత్తల శివకుమార్ కడప డీఎస్పీ, ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు. మండల కేంద్రమైన సిద్దవటంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ తనతో పాటు బొంత రమాదేవి 2002 సంవత్సరంలో ప్రభుత్వం అసైన్‌మెంట్ కమిటీ ద్వారా సర్వేనెంబర్ 164 లింగంపల్లె రెవెన్యూ గ్రామ పొలంలో పట్టా పొందామన్నారు. ఈనెల 14వ తేదీన భూమి సాగు చేసుకునేందుకు జేసీబీతో పని చేయిస్తుండగా వెన్యూ వారు వచ్చి రికార్డులను పరిశీలించి వెళ్లారన్నారు. అయితే లింగంపల్లె గ్రామ మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు ఫోన్ చేసి తనను అడగకుండా భూమి సాగు చేసేందుకు ఎంత ధైర్యం నీకు అంటూ బెదిరించాడన్నారు. ఆ తరువాత కొంత మంది లింగంపల్లె దళితులను తన వద్దకు పంపి తనపై దౌర్జన్యం చేసి పనిని నిలుపుదల చేశారన్నారు. అంతటితో ఆగకుండా వెంకటేశ్వర్లు తన మనుషులైన ఈరిశెట్టి సురేష్, ఈరిశెట్టి మునిసుబ్బరాయుడు, ఈరిశెట్టి నాగరాజు, పిట్టి గోపాల్‌ల చేత తనపై హత్యాయత్నం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారన్నారు. వారి నుంచి తనకు రక్షణ కల్పించాలని అధికారులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఆయన తెలిపారు.

సూరప్పగారిపల్లెలో భారీ చోరీ

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లె పంచాయతీ సూరప్పగారిపల్లెలో భారీ చోరీ జరిగింది. వ్యవసాయపనుల నిమిత్తం పొలాల వద్దకు వెళ్లిన ఓ రైతు ఇంట్లో దుండగులు ప్రవేశించి 150 గ్రాముల బంగారు నగలు, రూ.50 వేలు నగదు ఎత్తుకెళ్లారు. గ్రామానికి చెందిన కుమ్మర మునిస్వామి వ్యవసాయం చేసుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం 11 గంటలకు ఇంటికి తాళాలు వేసుకొని గ్రామానికి సమీపంలోని తన పొలం వద్దకు వెళ్లారు. రైతు దంపతులు సాయంకాలం పనులు చేసుకొని ఇంటికి తిరిగి వచ్చారు. ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉంచిన రూ.13లక్షలు విలువచేసే బంగారు నగలు, రూ.50 వేలు నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు.

ఏప్రిల్ 2 నుంచి సీపీఎం జాతీయ మహాసభలు



మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : సీపీఎం జాతీయ మహాసభలు ఏప్రిల్ 2 నుంచి తమిళనాడులోని మధురైలో నిర్వహించనున్నట్లు సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ తెలిపారు. ఆదివారం ఆర్‌కే నగర్‌లోని సీపీఎం కార్యాలయంలో పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో దేశంలో, రాష్ట్రంలో జరిగే ఎలాంటి ఎన్నికల్లోనా సీపీఎం పొత్తులు ఒకే రకంగా ఉండవని తెలిపారు. స్థానిక పరిస్థితులను బట్టి ఉంటాయన్నారు. ఏప్రిల్ 2 నుంచి 6వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రంలోని మధురైలో జరిగే 24వ సీపీఎం జాతీయ మహాసభల్లో స్పష్టమైన రాజకీయ విధానం రూపొందించనున్నట్లు తెలిపారు. నేడు దేశంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ మత ద్వేషాన్ని ప్రచారం చేస్తున్నాయని చెప్పారు. దీనికి వ్యతిరేకంగా లౌకిక ప్రజాస్వామ్య శక్తులను ఐక్యం చేయడం సీపీఎం భవిష్యత్తు కార్యాచరణ అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏ.రామ్మోహన్, బి.మనోహర్, వి.అన్వేష్, జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్ రెడ్డి, బి.దస్తగిరి రెడ్డి, పి.చాంద్ బాషా, కె.సత్యనారాయణ, గౌసియా బేగం తదితరులు పాల్గొన్నారు.

దళితుల స్థలాలను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి



తమకు ప్రభుత్వం ఇచ్చిన డీకేటీ పట్టాలను చూపుతున్న ఎస్సీ కాలనీ వాసులు

కమలాపురం : కమలాపురం మండలం ఎర్రబల్లె, కొత్తపల్లె ఎస్సీ కాలనీకి చెందిన దళితులకు ప్రభుత్వం పంపిణీ చేసిన స్థలాలను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ కమలాపురం ఏరియా కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఆక్రమణకు గురైన స్థలాన్ని లబ్ధిదారులతో కలసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1994లో అప్పటి ప్రభుత్వం సర్వే నెంబర్ 100/726 లో ఎర్రబల్లె కొత్తపల్లె ఎస్సీ కాలనీ వాసులకు 2.30 ఎకరాలు కేటాయించిందన్నారు. అందులో ఒక ఎకరాలో 30 మందికి ప్లాట్లు వేసి డీకేటీ పట్టాలు పంపిణీ చేసిందన్నారు. మిగిలిన 1.30 ఎకరాలు కమ్యూనిటీ అవసరాల కోసం అలాగే వదిలేశారన్నారు. ఆ స్థలాన్ని గ్రామానికి చెందిన ప్రతాప్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డిలు ఆక్రమించుకున్నారని ఆయన ఆరోపించారు. రెవెన్యూ అధికారులు స్పందించి ఆక్రమణకు గురైన భూమిని గుర్తించి ఎస్సీలకు అప్పగించాలని, అలాగే ఆక్రమణ దారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రైవేట్ డిగ్రీ అండ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ కార్యవర్గం



సంభావు వెంకటరమణ (అధ్యక్షుడు)



శ్రీనివాసులు (జిల్లా కార్యదర్శి)

కడప ఎడ్యుకేషన్ : యోగి వేమన యూనివర్సిటీ పరిధిలోని ప్రైవేట్ డిగ్రీ అండ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నగరంలోని స్క్వేర్ సమావేశ మందిరంలో జరిగిన అసోసియేషన్ నాయకుల సమావేశంలో నూతన అధ్యక్షుడిగా రాజంపేట గీతాంజలి డిగ్రీ కాలేజ్ కరస్పాండెంట్ సంభావు వెంకటరమణ, కార్యదర్శిగా ముద్దనూరు వెంకటేశ్వర డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ జి.శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా నాగేశ్వరరెడ్డి, జయప్రకాశ్‌రెడ్డి, కోశాధికారిగా ఆలీ అక్బర్, సంయుక్త కార్యదర్శిగా ఎస్.సంజీవ రెడ్డి, రవి శేఖర్ రెడ్డి మిగిలిన సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో మాజీ అధ్యక్షులు మదనమోహన్ రెడ్డి, రవి శేఖర్ రెడ్డి, సుబ్బారెడ్డి, పెంచలయ్య, రాజగోపాల్ రెడ్డి, పోలా రమణారెడ్డి, రాష్ట్ర నాయకులు పి.సురేష్, విజయ్ కుమార్, మనోహర్ రెడ్డి, రాఘవరెడ్డి, సంజీవరెడ్డి, నరసింహులు, వివిధ కళాశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

కబ్జాదారులకు వంతపాడుతున్న రిజిస్ట్రేషన్ అధికారులు

కడప కార్పొరేషన్ : కడప నగర పరిధిలో కబ్జాదారులకు వంతపడుతూ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు నీటి మునక భూములను రిజిస్ట్రేషన్ చేస్తున్నారని దళిత ఫోరం నాయకుడు బూసిపాటి కిషోర్ ఆరోపించారు. కడపలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఆర్ట్స్ కాలేజ్ ఎదురుగా సర్వేనెంబర్ 955లో గల 23 సెంట్ల భూమిని కబ్జాదారులు తప్పుడు పత్రాలతో కబ్జా చేశారన్నారు. ఈ భూమి ప్రభుత్వ రికార్డుల్లో నీటి మునక భూమిగా రిజిస్ట్రేషన్ అయిందన్నారు. ఈ భూములను రిజిస్ట్రేషన్ చేయవద్దంటూ సుప్రీంకోర్టు స్పష్టంగా ఇదివరకే ఆదేశాలు ఇచ్చిందన్నారు. కానీ అధికార పార్టీకి చెందిన ఓ నేత అండదండలతో కబ్జాదారులు తప్పుడు పత్రాలు సష్టించి ఈ భూమిని కబ్జా చేశారన్నారు. గతంలో ఈ భూమి విషయంపై అనేక వివాదాలు తెరపైకొచ్చిన సందర్భంలో ఓ రెవెన్యూ అధికారి సస్పెండ్ అయ్యారన్నారు. కలెక్టరేట్ సమీపంలో కబ్జాకు గురైన ఈ భూమి విషయమై త్వరలోనే కలెక్టర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ల దష్టికి తీసుకెళ్తామన్నారు.

దీక్షలు విరమించండి

ఏపీఎస్‌వీసీ ఛైర్మన్ డాక్టర్ లక్ష్మయ్య



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏపీఎస్‌వీసీ ఛైర్మన్ డాక్టర్ పి.వి.లక్షుమయ్య

ప్రొద్దుటూరు రూరల్ : దీక్షలు విరమించి తరగతులకు హాజరు కావాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ వెటర్నరీ కౌన్సిల్(ఏపీఎస్‌వీసీ) ఛైర్మన్ డాక్టర్ పి.వి. లక్షుమయ్య పశువైద్య విద్యార్థులకు సూచించారు. ఆదివారం మండలంలోని గోపవరం గ్రామ సమీపంలో ఉన్న పశువైద్య కళాశాల ఆవరణలో పశువైద్య విద్యార్థులు చేపట్టిన దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దీక్షలను విరమిస్తే పశువైద్య విద్యార్థుల తరపున ప్రభుత్వంతో చర్చిస్తామని తెలిపారు. తరగతులు కోల్పోకూడదని, మీకు న్యాయం చేస్తామని చెప్పారు. ప్రభుత్వం పెంచిన రూ.10,500 స్టైఫండ్ మీకు సరిపోదని తనకు తెలుసునని ఇంకొంచం పెంచేందుకు తాను ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. రెండు మూడు రోజుల్లో ప్రభుత్వం జీఓ విడుదల చేస్తుందని పేర్కొన్నారు. అందుకు పశువైద్య విద్యార్థులు మాట్లాడుతూ జీఓ వచ్చేంత వరకు దీక్షలను కొనసాగిస్తామని తెలిపారు. మిగిలిన పశువైద్య కళాశాలలైన గరివిడి, గన్నవరం, తిరుపతి విద్యార్థులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ద్విచక్ర వాహనం







ప్రమాదంలో గాయపడిన యువకులు

చింతకొమ్మదిన్నె : మండల పరిధిలోని కడప – చిత్తూరు జాతీయ రహదారిపై షెంఫోర్డ్ స్కూలు సమీపంలో భారత్ పెట్రోల్ బంక్ ఎదురుగా శనివారం అర్ధరాత్రి ఆగి ఉన్న లారీని ద్విచక్ర వాహనం ఢీకొంది. జమాలపల్లె గ్రామానికి చెందిన ఆరిఫ్, షేక్ అహ్మద్, అబ్దుల్లా గౌస్ అనే ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. ఈ ప్రమాదాన్ని గుర్తించిన హైవే పెట్రోలింగ్ రక్షక్ సిబ్బంది గాయపడిన వారిని కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

నూతన నియామకం



నియామకపత్రాలను అందజేస్తున్న జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజుల భాస్కర్

రాయచోటి జగదాంబ సెంటర్ : రాయచోటి పట్టణంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లాలోని వివిధ మండలాలకు, పట్టణాలకు నూతన అధ్యక్షులకు నియామకపత్రాలను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గాజుల భాస్కర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి అల్లాబకష్, పుంగనూరు ఇన్‌చార్జి మురళీయాదవ్, పీలేరు ఇన్‌చార్జి సోమశేఖర్‌రెడ్డి, రైల్వేకోడూరు ఇన్‌చార్జి గోశాల దేవి, పార్టీ సీనియర్ నాయకులు రామకష్ణారెడ్డి, రాయచోటి చెన్నకష్ణ తదితరులు పాల్గొన్నారు. **కాంగ్రెస్ పార్టీ మండలాల అధ్యక్షులు వీరే :** షేక్ ఆదిల్ (రాజంపేట పట్టణం), మహదేవయ్య (రాజంపేట రూరల్), సల్మాన్(టి.సుండుపల్లె), సుబ్బరాయుడు (ఒంటిమిట్ట), శ్రీనివాస్ (చిట్వేలి), రమేష్ (పుల్లంపేట), జీవరత్నం (పెనగలూరు), హరిక్రిష్ణారెడ్డి(ఓబులవారిపల్లె)ను నియమించారు. అలాగే బాబాసర్దార్ (రాయచోటి పట్టణం), నాగార్జున (లక్కిరెడ్డిపల్లె), గణేష్ (రామాపురం), సుబ్బయ్య (సంబేపల్లె), షబ్బీర్‌ఖాన్ (చిన్నమండెం), పీలేరు నియోజకవర్గంలో ఫిరోజ్ (గుర్రంకొండ), సాంబశివ (వాయల్పాడు), శ్రీకాంత్(పీలేరు), మదనపల్లె నియోజకవర్గంలో సతీష్‌రెడ్డి (రామసముద్రం), శేఖర్ (నిమ్మనపల్లె) లను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుగా నియమించారు.